బాలిగాన్ని పురుగు ముట్టిందన్న సంగతి గేరివిండా పాకిపోయింది. ఒక్కొక్కరే వచ్చి సూసి పోతుండ్రు. వాగుబామా! నూనె కట్లపామా! సెడుగా! ఏం కరిసిందని అడుగుతుండ్రు. సీకట్ల ఏమేడ్సి సచ్చిందో ఎవడు సూసిండుగనక.

పరసర పాకొచ్చి ముల్లు గుచ్చినట్లు పండు దించిపోయింది. బాలి గాడు యేమైంది సెప్పలే పోతుండు. సెమటలు కమ్ముతున్నయానికి. సౌకుదీసి అల్సిపోయిన గుర్రం నోట్లనుంచి నురుసొచ్చినట్లు వస్తుండ దానోట్లనుంచి.

"ఆరీన్ని యవ్వ! అందరాని చుట్టూ యీగలు ముసురుకున్నట్లు ముసురుకుంటే యెట్లాపిరాడి వస్తదక. జర జరుగుండి" అన్నాడో పెద్దమనిసి.జనం కొద్దిగ పక్కకు జరిగిండ్రు.

బాలిగాని పెండ్లం పోశమ్మ ఆరునొక్క రాగం దీస్కుంట ఆని నెత్తికొడ కూసు న్నది. పోశమ్మ ముక్కులంగ సీమిడి, కండ్లల్ల కెల్లి నీల్లొచ్చి గదుమకింద కల్సు కోని సంగెమయ్యింది.

"ఊకుకోవే నీయమ్మ! ఆనికేం గాదు. కమ్మరి రవుణయ్య మంత్రిస్తే జరసేపట్లో దిగిపోతది.తలా ఒకేడు పేడిస్తే అది సూడ లేక ఆడు నిజంగానే సచ్చిపోతుండననుకోని సస్తడు. సప్పుడు సేయకని" పోశమ్మను కసిరి "ఆశారి దగ్గర్కుపోయి జర పిల్సక రారా యెల్లిగా!" అని సెప్పిండు ముత్తయ్య పక్కనున్న పోరగాడికి.

"ఆయిన మన గేరికి. అందుల మనింటి కొస్తాదే! నీ తిక్కగాని పెద్దకులపోన్నని. తనే పెద్ద మంత్రగాడి ననుకుంటడు.అసోం టాయిన గింతదూరం నడిసొస్తాడ?" ఇంకొ గడన్నడు.

ఆశారి రవుణయ్య ఆ సుట్టుపక్కలంతటికి పెద్ద మంత్రగాడు. ఆయన పేరు సెప్పితేనే పాదరసం లెక్క పారాడే పాముగూడ గడ్డ గట్టి గుడ్డు వెడ్తది. భూమీమీద నూక లుండి ఎవడన్న బతికి బట్ట కట్టినా ఆడు నా మంత్రబలంతోటే బతికిండంటడు నూకలు సెల్లి నోడు సొర్గం మెట్లుదొక్కినా. అంతై పోయినంక తీసుకొచ్చిండ్రు. అందుకే సచ్చిండని సెప్పేస్తడు.

"రవుణయ్య గింతదూరం రాడు. గర్జు మనది. మొక్కు దీస్కోనీకె మనం గుడికి పోతంగాని.గుడి మన దగ్గరకొస్తద? గిది గంతె. యింగెత్తుకోండి బాలయ్యను తీస్కపోదం" అన్నడు పెద్దమనిసి.

బాలిగాన్ని ముత్తయ్య భుజం మీదికెత్తు కున్నడు. ఇంగ జనమంత వాల్లెంట రవు ణయ్య యింటితోవ పట్టిండ్రు. రవుణయ్య ఆ సమయంల తానుంచుకున్న నర్సమ్మతోటి సరసాలాడుకుంటలోపలున్న ట్లుండది. యీల్లు వోయి దబదబమని దర్వా జాను కొట్టిండ్రు."ఏ ముండ కొడుకురా! గిప్పుడు తలుపు కొడుతుండ. రసకందా యంల వున్నోన్ని నీరసంలకు దించు తుండోనుకుంట. తిట్టుకుంట తలుపులు తీసిండు. ముత్తయ్య భుజంమీదినుంచి బాల య్యను దించి ఆడనే పండవెట్టి.

"అయ్యా! యీన్ని పురుగు ముట్టింది" అని ఆ వైనమంతా సెప్పవట్టిండు. రవు ణయ్య కోపంలో వున్న సంగతి తెల్వదు కాని. ముత్తయ్య సెంపవాసి పోయేటట్లు ఓ దెబ్బ వెట్టిండు. యెంటనే ఆడు కండ్లుదిర్లి పడిపోయిండు దెబ్బకు తట్టుకోలేక. సుట్టు పక్కలున్న పోరగాల్లకంత పవురుసం ముంచుకొచ్చింది. "యీనమ్మ ఆపదంట యింటిముంగలికొస్తె కొడ్తాడ?" అను కున్నరు. కాని. "అరే పొట్టెగాండ్లు మీకేం దెలుస్తది అది మంత్రం దెబ్బరా! యీన్ని కొడితేనే ఆని యిసం దిగుతద"ని పెద్దో ల్లన్నరు. యింగాపోరగాండ్లేమి మాట్లాడలే.

ముత్తయ్యను సెంపదెబ్బ సర్సినంక. "యాడకర్సిందిరా!" అనడిగిండు మంత్ర గాడు రవుణయ్య.

"ఇంగో అయ్యా! గీడ" అనుకుంటా పిక్కమంద దగ్గర సూయించిండు పెద్దమనిసి.

"అది కాదరా! యాడ ఇంటికాడనా? ఆడివిల్నా అని అడుగుతున్న."

"గొర్రెకయ్యలు కుంకినంక జొన్న సేనొంక పోయిండయ్యా! గెట్టు పొడ్తి పోతుంటే కాలగడ్డ యాడున్నదో యేమో కాటేసి పోయింది" —యేడ్సుకుంటనే సెప్పింది పోశమ్మ.

"ఏం పురుగో సెప్పిండా?"

"లేదయ్యా! కాని తాసుపామనే అను కుంటుండం. యెందుకంటే ఆయింకల్ల యెప్పుడొగటి తిరుగుతుంటది. గదే కావొచ్చు."

"అదేనో యింకేదన్ననో" అనుకుంట గింత పచ్చియాపాకు దెచ్చి"గిది నముల్రా బాలిగా"అంట యిచ్చిండు.బాలిగాడు నముల లేక నముల్తుండు.

"యెట్లుండదిరా?"

"తియ్యగుండది బెల్లం లెక్క" బాలి గాడు సిన్నగ సెప్పిండు. గిన్ని వండు మిరపకాయలిచ్చి నములమన్నడీ సారి.


"గివెట్లుండయిరా?" అనడిగిండు రవు ణయ్య.

"సప్పగుండయి సొప్ప లెక్క" బాలిగా డన్నడు.

"వోయమ్మో! వోర్నాయినో!!" నెత్తి కొట్టుకున్నది పోశమ్మ. యిసమెక్కినోల్కి యాపాకు తియ్యగ. మిరపకాయ సప్పగుం టదని అందరనుకువంగ యిన్నదామె.

"ఊకోవసీ! మంత్రమేస్తుండు దిగి పోతది" ముత్తయ్య పోశమ్మను గదుమా యించిండు.

రవుణయ్య మంత్రం యేస్తున్నడు.



# పాము - చీమలు

బి. శ్రీరామ రెడ్డి

"పూడలమట్టి కింద మట్టితొట్టికింద. పుట్టలోజెట్ట. దాన్ని నేను పట్ట. యీవి యిసం దిగ. దాని నోరు తెగ", మంత్రం పెద్దగ సదువుతున్నాడు. యాపమండల తోటి తుడుస్తున్నడు.

పొద్దు బారెడెక్కింది. జరజర కోలు కున్నడు బాలిగాడు. రవుణయ్య మంత్రం పారిందనుకున్నారు. ఆయన మంత్రం యింతొరకు పాటి దప్పలేదు. యాడంగ తప్పుతది. యీయనెంత సత్తెమంతుడు. యెంత నీతిమంతుడు యెవరికీ తెల్వదు. గందుకనే పాలమీది పొంగుకు నీల్లు సల్లి నట్లు సల్లగ దిగిపోతది యిసం అనుకున్నరు.

బాలిగాడు ఆని బలగం రవుణయ్య యింటికాడనే వున్నరు. గంతట్లనే పటేలు అంజిరెడ్డి దగ్గర్నుంచి జవానురుకొచ్చిండు. బాలిగా పటేలు పిలుస్తున్నడనుకుంట.

"ఆడు సావుబతుకుల్ల వుంటె యెట్లొస్త డయ్యా పో!పో!! పటేలుకు సెప్పు బాలి గాన్కి తెల్లరగట్ల పాము కరిసింది." అని సెప్పిండు ముత్తయ్య.

"అదిగాదు గోదల్నిడువనీకె ఆని కొడుకు గూడ వస్తలేడంట. అగ్గిమీద గుగ్గి లమైతుండాయిన" జవానన్నడు.

"యిల్లుకాలి ఒకడేడుస్తుంటే, పెండ్లం కావాల్నని యింకోడేడ్పిండంట! గట్లున్నది పటేలు యవ్వారం. తండ్రి ఆపసోపాలు పడుతుంటె కొడుకుదగ్గరుండాల్నా! లేదా?" అడిగిండో పెద్దమనిసి.

"నాకు దెల్వదీపికులాట" అనుకుంట పోయిండు పటేలు జవాను.

"ఆయనకు దగ్గోదే యీడుగూడ."

జవాను పోతుంటె అందరనుకున్నారు.

కొంచెంసేపటికే పటేలు అంజిరెడ్డి ఆడి కొచ్చిండు. దొర సుట్ట తాగుకుంట. దోతి పెంగులు పెకుక్కుంట. "అరె బాలిగా! కంకులెవరిరిసింద్రా సేలె?" అడిగిండు పటేలు.

అప్పుడప్పుడే కోలుకుంటున్న బాలి గాడు. "ఎవరిసేలయ్యా!" అనడిగిండు.

"ఎవరిసేలంట వేందిరా లంజకొడ్కా నా సేల! రేకలు వారేటప్పుడు పోయిసూస్తే అంత మోరికి వెట్టినట్లు కనిపిస్తుండది." అన్నడు పటేలు.

"నీ సేలకు రాలేదు పటేలా! నాకు తెల్వదు." జవాబు సెప్పిండు బాలిగాడు.

"నాకు తెల్సు! గడ్డికొడుకా అదెవరు చేసిన పనికాదు, నీకు దప్ప. నా దగ్గర పుటూతుండదిరా! నీవే కంకులేరినవ్?" కొంద్రించి పూసిండు పటేలు.

"ఎవరు సూసింద్రంట పటేలా?"

"తెలుగోల్ల పోరగాడు పెంద్రయ్య. మోటగట్టనీకె గొరుకొయ్యలు కుంకివంక పోతుంటే నీ వెదురుగాలే?"

"అయిన! అయితే?"

"నీ దగ్గరిప్పుడు మూటుండెనా?"

"వుండె! వుంటే?"

"అదేం మూటరా! జొన్నకంకిగాదూ? నా సేల యేరలే?"

"జొన్నకంకేగాని నీ సేలగాదు పటేలా! నా పొలంలదే" నెత్తిన సెయ్యేసుకోని పెమానంజేసి సెప్పిండు బాలిగాడు.

"నీకు పొలమాడం గొచ్చిందిరా లంజ కొడ్కా?" గుడ్లురిమి సూసిండు పటేలు.

"గదేంమాట పటేలా! మీ సెల్కావ తలిగె రాన తున్క యీస్తేగదా?" అన్నాడు ముత్తయ్య.

"గైరాను దున్నుకోమని సెప్పినంతల్నే వానిదై పోయినాది? కాస్తుయింకోని పేరు మీదుంది. ఏదో పోరగాన్ని గోదలు కాయనీకె పుంచిండుగదాని దున్నుకోమన్న. మల్ల నా పొలం గిలం అన్నవంటే పండ్లి రుగ తంతా?" పండ్లు నూరిండు పటేలు.

"సర్కారు పొలాలు గూడ మీ పేర్ల మీదుంటయా? నాయం గీయం యేం లేదా యేంది? పదేండ్ల మట్టి దాన్ని దున్నుక బతుకుతుండ. దాంట్లెల్లిన గింజలు తింటుండ?" బాలిగాడన్నడు.

"ఆ గైరాను తున్క నీ కూరికియ్య లేదు కొడ్కా! భూంపాలుకిచ్చిన. పండిందాంట్ల నాకు పాలుంటదని తెల్వదా?"


"పదేండ్ల నుంచి లేని పాలు యిప్పు డేడంగొచ్చింది? నా రెక్కల కష్టం నేను దిన్న. అండ్ల తప్పేంది?"

"బిడ్డా! కాన కాన మాట్లాడుతుండవ్! కండ్లు నెత్తికెక్కినయ్! నీ పోరగాడు నా దగ్గరున్నడుగదాని యిన్నేండ్లు అడిగలే యిప్పడడుగుతున్న. అవునూ! నీ పొల మైతే రాత్రిపూట దొంగతనంగ యెందు కేరుకున్నవ్రా కంకులు?" గాంద్రకొట్టిండు పటేలు పులిలెక్కన.

"రాత్రి యింటికొచ్చినంక మా యింటిది సెప్పింది ఏందయ్యో పొద్దటికి సంకటొండు కోనీకె పిడికెడు గింజలు గూడ లేవని,



# 'కళాసాగర్' 9వ ఫిలిం అవార్డ్సు ఫంక్షన్



అవార్డులు అందుకుంటున్న దర్శకుడు శ్రీ కె. విశ్వనాథ్. డాక్టర్ అక్కినేని. (ఎడమ ప్రక్క) చివరగా వున్నది కళాసాగర్ అధ్యక్షులు శ్రీ డి. ఎన్. లింగం

'కళాసాగర్' 9వ సంవత్సరపు అవార్డు ఫంక్షన్ మద్రాస్ యూనివర్సిటీ సెంటినరీ హాలులో డిసెంబరు 2న ఘనంగా జరిగింది.

తమిళనాడు గవర్నర్ శ్రీ ఎస్. ఎల్. ఖురానా అధ్యక్షత వహించారు.

మధుర భాషిణి షావుకారు జానకి వ్యాఖ్యాతగావ్యవహరించారు.'మేఘసందేశం' ఉత్తమ చిత్రం. ఉత్తమ దర్శకుడు. ఉత్తమ నటుడు. ఉత్తమ నటి. ఉత్తమ సంగీత దర్శకుడు బహుమతులను శ్రీమతి దాసరి పద్మ. శ్రీ దాసరి నారాయణరావు. డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు. శ్రీమతి జయసుధ. శ్రీ రమేష్‌నాయుడు స్వీకరించారు.

ప్రత్యేక ప్రశంస చిరంజీవి (శుభలేఖ) పొందారు.

అవార్డ్సు స్వీకరించినవారిలో ఉత్తమ సహాయ నటుడు శ్రీ గొల్లపూడి. హాస్యనటుడు సుత్తివేలు. ఉత్తమ కథారచయితగా కె. విశ్వనాథ్. ఉత్తమ పాటల రచయితగా మల్లెమాల. ఉత్తమ గాయనిగా పి. సుశీల వున్నారు. బహుమతి ప్రదానానంతరం నటీనటుల సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. మురళీమోహన్ లా శ్రీ దాసరి సారథ్యం వహించారు. శ్రీయుతులు సత్యనారాయణ. అల్లు రామలింగయ్య. రావు గోపాలరావు. మోహన్‌బాబు. జయసుధ. జయమాలిని. గొల్లపూడి. రమాప్రభ. నాగేష్. వి. కె. రామస్వామి. మాడా. రాళ్ళపల్లి. చిట్టిబాబు. సుత్తివేలు. మొదలయిన వారంతా వివిధ నాటికలు. "వరదలొచ్చాయి" వంటిస్కిట్స్ ప్రదర్శించారు.

చిరంజీవి అనిల్ 'మేఘసందేశం'లో శ్రీ ఎ. ఎన్. ఆర్. పాట. నటనను అనుకరించి అందరి ప్రశంసలు పొందాడు.

## 'కళాసాగర్' విరాళం

ఆంధ్రప్రదేశ్ వరద బాధితుల సహాయార్థం 'కళాసాగర్' ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన 35 వేల రూపాయల చెక్‌ను గవర్నర్ శ్రీ ఖురానా చేతిమీదుగా శ్రీ దాసరికి సమర్పించారు. ○

---

తెల్లారగట్ల పొయ్యిగిన్ని అయినయిన కంకులేరుకారారాదూ! సేబదుల్లు గూడ పుట్టేటట్లు లేవన్నది. అందుకని పొయ్యి యేరుకొచ్చి కొట్టుకున్న తప్పేం జేసిన?" తానేం తప్పు పేయలేదన్నడు బాలిగాడు.

"దొంగముండా కొడుకా నాకే ఎదురు మాట్లుతావ్! నీ యబ్బ పొలమా? మీదంగ దబాయిస్తవ్! ఎవడనుకున్నవ్ అంజిరెడ్డిరా! నీ గుండెల్ల నిద్రవోత కొడుకా" కోపం తోటి అరిసిండు పటేల్ అంజిరెడ్డి.

"నీ యింట్ల నీవు నిద్రవోవయ్యా! నాకేంచి. నీ సొమ్ము తినోన్నెవ్వి అడుగు" నీరసంగా జవాబిచ్చిండు బాలగాడు.

"మాటలు శానొస్తుండయి ఓడ్డా, తన్నిదంతే సస్తవ్."

"తంతరయ్యా! తంతరు. మేం పదున్నెంత కాలం తంతరు. ఎదుపు తిరిగిసంకటి యిజ్జతేముంటది."

"మాటకు మాటందిస్తావురా! తన్నకుంటె ముద్దు పెడ్తార్" అనుకుంటనే బలం కొద్ది బాలిగాని గజ్జల్ల తన్నిండు పటేలు.

అమ్మా అనుకుంట యిరుసుకిపడ్డడు బాలిగాడు. బాగా దెబ్బ తాకింది. కండ్లు మూసుకున్నడు. "సూస్తరేంద్రా! యెయ్యండ్రా పటేలుగాన్ని" అని లేసిండు ముత్తయ్య. అక్కడ మిగిలినోలు నోరిప్ప లేదు. సేతులెత్త లేదు. ఎందుకంటే అల్లంతా పటేలు దగ్గర మిత్తికి పైసలు దెచ్చుకుంటరు. నాగుకు గింజలు దెచ్చుకుంటరు యెదురుదిరిగితే ఆటినక్కడ్నే కక్కమని పీచదీస్తడు. అందుకేయెవరేమన్లేదు.

బాలిగాడు కిందపడ్డోడు మల్లలేవలేదు. పోశమ్మ నెత్తి నోరు కొట్టుకున్నది. ముత్తయ్య బాలిగాని ముక్కు దగ్గర యేలు వెట్టి సూసిండు. వూపిరాడ్తలేదు. కమ్మరి రవుణయ్య గీ పాము కాటుకు నా దగ్గర మంత్రంలేదని యాపమండలు యసిరేసిండు.

పాము పడిగిప్పి ఆడనే ఆడుతుండది. దానాట కట్టించనీకె యీ నల్లసీములు. బాంచ సీమలతోటి కాదు— సలిసీమలు కావాలె. అందుకే పక్కూరి కురికిండు ముత్తయ్య— తన కులపోల్ల సలిసీమల సేయనీకె. పాము పొగరు అణగదొక్కనీకె. ●